తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : రత్నం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
03 నవంబర్ 2025
సంపుటి 76
సంచిక 3
పేజీలు 6
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna


# దశాబ్దాల కల సాకారం

## చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు..

## తొలిసారి వరల్డ్ కప్ కైవసం




- మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) హాఫ్ సెంచరీలు
- బౌలింగ్‌లో 5 వికెట్లతో దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించిన దీప్తి శర్మ
- సఫారీ కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) అద్భుత సెంచరీ వృథా
- భారత ఆల్‌రౌండర్ల ప్రదర్శనతో సొంతమైన ప్రపంచ టైటిల్

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 :భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల ఆశలను నిజం చేస్తూ తొలిసారిగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌కు, చివర్లో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో భారత్ జగజ్జేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వీరోచిత సెంచరీ చేసినా, తన జట్టును గెలిపించలేకపోయింది. ఈ మెగా ఫైనల్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన (45), షఫాలీ వర్మ (87) అద్భుతమైన శుభారంభం అందించారు. ముఖ్యంగా షఫాలీ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసి భారీ స్కో-రుకు పునాది వేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగానే వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (24 బంతుల్లో 34) మెరుపులు మెరిపించడంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. సఫారీ బౌలర్లలో అయాబొంగా ఖాకా 3 వికెట్లు పడగొట్టింది. 299 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం అద్భుతమైన షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. కేవలం 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే, మిగతా బ్యాటర్ల నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అనెరీ డెర్క్‌సెన్ (35) మినహా ఎవరూ రాణించలేకపోయారు. ఈ దశలో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేసింది. కీలకమైన వోల్వార్ట్ వికెట్‌తో సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. ఆమె అద్భుతమైన బౌలింగ్‌కు సఫారీ బ్యాటర్లు నిలవలేకపోయారు. దీప్తికి తోడుగా షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లు తీసి తన ఆల్‌రౌండ్ సత్తాను చాటింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా భారత అమ్మాయిలు 52 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుని ప్రపంచకప్‌ను గర్వంగా ముద్దాడారు. 2005, 2017 వన్డే వరల్డ్ కప్ లలో టీమిండియా అమ్మాయిలు ఫైనల్ చేరినా, కప్ దక్కించుకోలేకపోయారు. ఇప్పుడా లోటును తీర్చుతూ, చారిత్రక విజయం నమోదు చేశారు.

## షాద్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత..

### మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినుల దాడి

- ప్రిన్సిపల్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన
- షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నాతో ఉద్రిక్తత
- మహిళా కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న విద్యార్థినులు
- పోలీసులు, విద్యార్థినుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట
- కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టీకరణ
- కొందరు విద్యార్థినులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వివరాలు 2 లో..



## 8 వ తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఖమ్మం జిల్లా కొణిజర్లలో 8వ తరగతి బాలికపై అఘాయిత్యం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు, ఒక మేజర్
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు
- ఘటన అనంతరం పరారీలో నిందితులు



తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : ఖమ్మం జిల్లాలో అత్యంత దారుణ ఘటన వెలుగుచూసింది. ఒంటరిగా వెళ్తున్న ఓ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితుల్లో ఇద్దరు 16 ఏళ్ల బాలురు కాగా, మరొకరు 18 ఏళ్ల యువకుడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో శుక్రవారం రాత్రి ఈ అమానుష ఘటన జరగగా, బాధితురాలి తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లడంతో, బాలిక తన నాయనమ్మ, తాతయ్యతో కలిసి సమీపంలోని ప్రార్థనా మందిరానికి వెళ్లింది. అక్కడి నుంచి ఇంటికి ఒంటరిగా బయలుదేరిన ఆమెను నిందితుల్లో ఒకడైన బాలుడు మార్గమధ్యలో ఆపాడు. "మీ తమ్ముడు కిందపడిపోయాడు ....

2

## నింగిలోకి భారత్ అత్యంత బరువైన ఉపగ్రహం

## ఇస్రోను అభినందించిన మోదీ

- ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం.. సీఎమ్ఎస్-03 ప్రయోగం సక్సెస్
- 'బాహుబలి'గా పిలిచే LVM3-M5 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగం
- ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించిన ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి
- ఈ ఉపగ్రహం భారత నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపకల్పన
- హిందూ మహాసముద్రంలో మరింత పటిష్టం కానున్న భారత రక్షణ వ్యవస్థ



వివరాలు 2 లో..

## దమ్ముంటే ఆ పథకం ఆపండి...

### సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్



- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- దమ్ముంటే సన్నబియ్యం పథకం ఆపి చూడాలని సీఎంకు సవాల్
- సన్నబియ్యం పథకం కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం
- మజ్లిస్ ఓట్ల కోసమే బీజేపీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- రాష్ట్రానిది కేవలం ఉచిత బస్సు పథకం మాత్రమేనని వ్యాఖ్య
- ఓటర్లను బెదిరిస్తున్నారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

2

## పేదల ఇళ్ల కూల్చివేతపై

## రాహుల్ గాంధీ మౌనం ఎందుకు..? - కేటీఆర్

- మేం కట్టాం, మీరు కూలుస్తున్నారు - రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్
- నన్ను దాటి బుల్డోజర్ వెళ్లాలన్న రాహుల్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరు? అంటూ నిలదీత
- 500 రోజుల్లో కేసీఆర్ సర్కార్ తిరిగి వస్తుంది, బాధితులకు న్యాయం చేస్తుందని హామీ

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతలకు పాల్పడుతోందని, ఈ అన్యాయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో తనను దాటి బుల్డోజర్లు వెళ్లాలని సవాల్ విసిరిన రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న కూల్చివేతలపై కేటీఆర్ ఒక ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గతంలో ఢిల్లీలో మాట్లాడిన పాత వీడియో క్లిప్‌ను ప్రదర్శించారు. "ధనికులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం" అనే నినాదంతో ఈ ప్రజెంటేషన్ సాగింది. ప్రభుత్వ చర్యల వల్ల నష్టపోయిన పలువురు బాధితులు కూడా ఈ సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం రాజధానిలో అరాచకం సృష్టిస్తోందని, దీనివల్ల ఎంతోమంది నిరాశ్ర-యులవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.



# పేదల ఇళ్ల కూల్చివేతపై రాహుల్ గాంధీ మౌనం ఎందుకు..? - కేటీఆర్

మొదటిపేజి తరువాయి..

కాంగ్రెస్ ప్రభుత్వం ధనికులను వదిలేసి, పేదలపైనే ప్రతాపం చూపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. చెరువులను కబ్జా చేసి ఓ రెవెన్యూ మంత్రి ఇల్లు కట్టుకున్నారని, హిమాయత్ సాగర్ సమీపంలో మరో మంత్రి వివేక్ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు కట్టుకున్నా హైడ్రా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని అన్నారు. "పేదలు కోర్టుకు వెళ్లే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లు కూల్చేస్తున్నారు. కానీ, సీఎం సోదరుడికి మాత్రం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే అవకాశం కల్పించారు. ఇదేనా మీ న్యాయం?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలో ఇల్లు కట్టినా నోటీసులు ఇచ్చే ధైర్యం కూడా హైడ్రాకు లేదని ఆయన ఎద్దేవా చేశారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు జరిగాయని కేటీఆర్ గుర్తుచేశారు. "హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాం. వైట్‌హౌస్‌తో పోటీపడేలా సచివాలయం నిర్మించాం. దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు, భారీ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేశాం. కానీ, ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కార్ చేసింది కేవలం కూల్చివేతలే" అని ఆయన దుయ్యబట్టారు. కూల్చివేతల సందర్భంగా ఒక గర్భిణిని తోసేశారని, మూడు సంవత్సరాల చిన్నారి ఆకలితో అలమటించిందని చెబుతూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. ఇంకో 500 రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక బాధితులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## షాద్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత.. మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినుల దాడి

మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఘర్షణకు దారితీసింది. ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు పట్టణ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆందోళనను అదుపు చేసేందుకు యత్నించిన ఓ మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే, కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్‌కు, విద్యార్థినులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమె ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహానికి గురైన తోటి విద్యార్థినులు ఏకమై మహిళా కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. "న్యాయం చేయమని అడిగితే మమ్మల్నే కొడతారా?" అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అనూహ్య పరిణామంతో పోలీసులు, స్థానికులు నిశ్చేష్టులయ్యారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్యలు విని, పరిష్కారం చూపే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు తేల్చిచెప్పారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొందరు విద్యార్థినులను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో షాద్‌నగర్ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థినుల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై కూడా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## 8 వ తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి

మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : ఖమ్మం జిల్లాలో అత్యంత దారుణ ఘటన వెలుగుచూసింది. ఒంటరిగా వెళ్తున్న ఓ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితుల్లో ఇద్దరు 16 ఏళ్ల బాలురు కాగా, మరొకరు 18 ఏళ్ల యువకుడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో శుక్రవారం రాత్రి ఈ అమానుష ఘటన జరగగా, బాధితురాలి తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లడంతో, బాలిక తన నాయనమ్మ, తాతయ్యతో కలిసి సమీపంలోని ప్రార్థనా మందిరానికి వెళ్లింది. అక్కడి నుంచి ఇంటికి ఒంటరిగా బయలుదేరిన ఆమెను నిందితుల్లో ఒకడైన బాలుడు మార్గమధ్యలో ఆపాడు. "మీ తమ్ముడు కిందపడిపోయాడు, దెబ్బలు తగిలాయి, వెంటనే రా" అని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన బాలికను, ఆ బాలుడు తన స్నేహితుడైన 18 ఏళ్ల యువకుడి ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ అప్పటికే మరో బాలుడు కూడా ఉన్నాడు. అనంతరం ముగ్గురూ కలిసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్న బాలిక భయంతో ఆ రాత్రి ఎవరికీ విషయం చెప్పలేదు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు తిరిగి వచ్చాక, వారికి జరిగిన ఘోరాన్ని వివరించడంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఒక యువకుడు, ఇద్దరు మైనర్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం నిందితులు ముగ్గురూ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## దమ్ముంటే ఆ పథకం ఆపండి

### - సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సన్నబియ్యం పథకాన్ని ఆపేస్తామని ముఖ్యమంత్రి ప్రజలను భయపెడుతున్నారని, దమ్ముంటే ఆ పథకాన్ని ఆపి చూడాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "సన్నబియ్యం పథకం కాంగ్రెస్‌ది కాదు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకంలో భాగం. ఈ పథకంలో కేంద్రం కిలో బియ్యానికి రూ.42 భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది కేవలం రూ.15 మాత్రమే. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి, పథకాన్ని ఆపేస్తామని బెదిరించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే" అని స్పష్టం చేశారు. ఓటు వేయకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరించడంపై ఇప్పటికే బీజేపీ తరఫున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మజ్లిస్ ఓట్లను దక్కించుకోవడానికే కాంగ్రెస్ పార్టీ బీజేపీపై విమర్శలు చేస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అమలు చేస్తున్న ఏకైక పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రజలను బెదిరించేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలతో ఉప ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది.



## మణుగూరులో ఉద్రిక్తత..

### బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడికి పాల్పడటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలోకి ప్రవేశించిన కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు నిప్పు పెట్టారు. అంతేకాకుండా, కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను చించివేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వానికి చెందిన స్థలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించారని కాంగ్రెస్ నేతలు కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ఇరు పార్టీల శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.




## నింగిలోకి భారత్ అత్యంత బరువైన ఉపగ్రహం

### ఇస్రోను అభినందించిన మోదీ

మొదటిపేజి తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 2 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం 'సీఎమ్ఎస్-03'ని ఆదివారం విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోట నుంచి 'బాహుబలి'గా పిలిచే ఎల్వీఎమ్3-ఎమ్5 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ విజయంపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "మన అంతరిక్ష రంగం దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎమ్ఎస్-03ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోకు అభినందనలు. మన శాస్త్రవేత్తల కృషితో మన అంతరిక్ష రంగం శ్రేష్ఠతకు, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచింది. ఈ విజయాలు దేశ ప్రగతికి దోహదపడటమే కాకుండా, ఎంతోమంది జీవితాలను శక్తిమంతం చేస్తున్నాయి" అని ప్రధాని పేర్కొన్నారు. భారత నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపొందించిన జీశాట్-7ఆర్ (సీఎమ్ఎస్-03) ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హర్షం వ్యక్తం చేశారు. "భారత శక్తివంతమైన ఎల్వీఎమ్3-ఎమ్5 రాకెట్ మరోసారి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ దేశీయ ఉపగ్రహం హిందూ మహాసముద్ర ప్రాంతంలో కమ్యూనికేషన్స్, కనెక్టివిటీ, సముద్ర జలాలపై నిఘాను గణనీయంగా బలోపేతం చేస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఇదొక గర్వకారణమైన మైలురాయి" అని తెలిపారు. ఈ ప్రయోగాన్ని నిపుణులు ఒక చారిత్రక విజయంగా అభివర్ణించారు. వ్యూహాత్మక, కమ్యూనికేషన్ ప్రయోజనాల కోసం బరువైన ఉపగ్రహాలను ప్రయోగించడంలో భారత్ సామర్థ్యం మరోసారి రుజువైందని తెలిపారు. ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ (రిటైర్డ్) మాట్లాడుతూ, "ఈ ప్రయోగం దేశ అంతరిక్ష సామర్థ్యాలకు ఒక నిదర్శనం. ఇది మన సముద్ర, జాతీయ భద్రతకు గేమ్-ఛేంజర్‌గా మారుతుంది. హిందూ మహాసముద్రం, దేశ ప్రధాన భూభాగంలో అత్యంత కీలకమైన సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థను ఇది అందిస్తుంది" అని వివరించారు. ఈ విజయంతో అధునాతన అంతరిక్ష సాంకేతికతను అభివృద్ధి చేయడంలో, ప్రయోగించడంలో భారత్ స్వావలంబన మరోసారి ప్రపంచానికి తెలిసింది. "ఆయన చాలా మంచివారు" అని యాషిక అనే చిన్నారి ఉత్సాహంగా చెప్పింది. 2017లో ఆపరేషన్ చేయించుకున్న కావ్య మిశ్రా మాట్లాడుతూ, "ప్రధానిని కలవడం నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది" అని తెలిపింది. వేలాది మంది చిన్నారులకు ఉచితంగా గుండె సంబంధిత చికిత్స అందిస్తూ పునర్జన్మ ప్రసాదిస్తున్న ఆసుపత్రి యాజమాన్యాన్ని, వైద్యులను, నర్సులను ప్రధాని మనస్ఫూర్తిగా అభినందించారు. వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన 'శాంతి శిఖర్' ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం, నవ రాయ్‌పూర్‌లోని నూతన ఛత్తీస్‌గఢ్ శాసనసభ భవనంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ భవనాన్ని సౌరశక్తి, వర్షపు నీటి సంరక్షణ వంటి పర్యావరణ హితమైన పద్ధతులతో నిర్మించారు. అంతకుముందు, రాష్ట్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిదని అన్నారు. "మన గిరిజన సమాజం తరతరాలుగా ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టింది. బస్తర్‌లోని మురియా దర్బార్ సంస్కృతి దీనికి నిదర్శనం. ఈ సంప్రదాయానికి కొత్త విధానసభలో చోటు కల్పించడం సంతోషంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

## హైడ్రా చొరవ.. విహార కేంద్రంగా మారిన కూకట్‌పల్లి నల్లచెరువు



తరంగాలు, డెస్క్, నవంబర్ 02 : ఒకప్పుడు ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాలతో మురికికూపంగా ఉన్న కూకట్‌పల్లి నల్లచెరువు ఇప్పుడు సరికొత్తగా జలకళను సంతరించుకుంది. హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనులతో ఈ చెరువు కూకట్‌పల్లికే మణిహారంలా మారింది. కేవలం ఆరు నెలల వ్యవధిలో చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయి, స్థానికులకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మారింది. ఆదివారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నల్లచెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భద్రతను పటిష్టం చేసేందుకు సీసీటీవీ కెమెరాలు, పిల్లలు ఆడుకునేందుకు రెండు ప్లే ఏరియాలు, పెద్దలు సేద తీరేందుకు విశ్రాంతి మందిరాలు, బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో ఔషధ మొక్కలు నాటి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఆక్రమణలతో 16 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును హైడ్రా అధికారులు రెవెన్యూ రికార్డుల ఆధారంగా 30 ఎకరాల వరకు విస్తరించారు. చెరువు పరిధిలోని 16 వ్యాపార షెడ్లను తొలగించారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడిక, చెత్తను పూర్తిగా తొలగించడంతో చెరువు లోతు 4 మీటర్ల మేర పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండుకుండలా మారింది. మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. హైడ్రా కృషితో చెరువు రూపురేఖలు మారిపోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారాంతాల్లో ఈ ప్రాంతం పిక్నిక్ స్పాట్‌గా మారుతోంది. ఉదయం, సాయంత్రం వందలాది మంది ఇక్కడికి వచ్చి సేద తీరుతున్నారు. చెరువు పక్కనే బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక వేదికను, నిమజ్జనం కోసం ఒక చిన్న కుంటను కూడా ఏర్పాటు చేస్తుండటం విశేషం.

# నేటి ప్రజావాణి రద్దు

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, 2 నవంబర్, తరంగాలు : వరంగల్ జిల్లా కలెక్టరేట్లో నేడు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా జరిగిన నష్టాల వివరాల సేకరణలో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి ని రద్దు చేస్తున్నట్లు, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, కలెక్టరేట్ కు రావద్దని కోరారు.

# కార్తీక మాసం ఎంతో పవిత్రమైనది

## - ఎమ్మెల్యే మురళీ నాయక్



కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్ 02,తరంగాలు : కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు.ఆదివారం కేసముద్రం మండలం బిచ్చా నాయక్ తండా గ్రామ పరిధిలోని ఉసిరి తోటలో మహబూబాబాద్ కు చెందిన శ్రీ మహా లక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ కు సంబంధించిన 108 జంటలు కార్తిక మాస పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ.ఉసిరి తోటలో సామూహిక వ్రతాలు ప్రధానంగా కార్తీక మాసంలో జరిగే ప్రత్యేక పూజలలో ఒక భాగంగా ఉంటాయని,హిందూ సంప్రదాయంలో ఉసిరి చెట్టుకు పవిత్రత, ఆయురారోగ్యం కలిగించే శక్తిగా భావిస్తారని అన్నారు.కార్తీక మాసంలో ఉసిరి చెట్టు చుట్టూ సామూహికంగా ప్రదక్షిణలు చేయడం, వ్రతాలు చేయడం ఒక సంప్రదాయంగా ఉందన్నారు.


# కార్తీక మాసం ఎంతో పవిత్రమైనది

## - ఎమ్మెల్యే మురళీ నాయక్





కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్ 02,తరంగాలు : కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు.ఆదివారం కేసముద్రం మండలం బిచ్చా నాయక్ తండా గ్రామ పరిధిలోని ఉసిరి తోటలో మహబూబాబాద్ కు చెందిన శ్రీ మహా లక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ కు సంబంధించిన 108 జంటలు కార్తిక మాస పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ.ఉసిరి తోటలో సామూహిక వ్రతాలు ప్రధానంగా కార్తీక మాసంలో జరిగే ప్రత్యేక పూజలలో ఒక భాగంగా ఉంటాయని,హిందూ సంప్రదాయంలో ఉసిరి చెట్టుకు పవిత్రత, ఆయురారోగ్యం కలిగించే శక్తిగా భావిస్తారని అన్నారు.కార్తీక మాసంలో ఉసిరి చెట్టు చుట్టూ సామూహికంగా ప్రదక్షిణలు చేయడం, వ్రతాలు చేయడం ఒక సంప్రదాయంగా ఉందన్నారు.


# కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా సహకార అధికారి గంగాధర్



పాలేరు ఆర్సీ, 02నవంబర్ ( తరంగాలు) కూసుమంచి మండలం జక్కేపల్లి సొసైటీలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జిల్లా సహకార అధికారి గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా దళారులను ఆశ్రయించకుండా.. కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యం విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జక్కేపల్లి సొసైటీ అధ్యక్షులు నలబోలు చంద్రారెడ్డి, పాలకవర్గ సభ్యులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దశరథ రామ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, గ్రామ నాయకులు పెదవీటి శ్రీనివాస్ రెడ్డి, రామిని అనంత రామిరెడ్డి, కొత్త నరేందర్ రెడ్డి, కొరివి వెంకటరత్నం, యాస విష్ణువర్ధన్ రెడ్డి, కొత్త ముకుందరెడ్డి, కొత్త అనంతరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, కొత్త సత్యనారాయణరెడ్డి, కళ్లెం అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం లో పలు రైళ్ళ హాల్టింగ్ కోసం ఎంపి వద్దిరాజు రవిచంద్రకు వినతి



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 02, తరంగాలు "కేసముద్రం లో పలు రైళ్ళ హాల్టింగ్ కోసం ఎంపి వద్దిరాజు రవిచంద్రకు స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. కేసముద్రం చుట్టుపక్కల గ్రామీణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాలకు కీలకమైన వ్యాపార మరియు రవాణా కేంద్రంగా పనిచేస్తున్న కేసముద్రం రైల్వే స్టేషన్ లో తిరుపతి-సికింద్రాబాద్ పద్మావతి ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 12763) సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 17206/17205) షిర్డీ సాయి నగర్-కాకినాడ పోర్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 17208/17207) నరసాపూర్-నాగర్‌సోల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 12787/12788) సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 12705/12706) సికింద్రాబాద్-మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 12745/12746) పలు రైళ్ల హాల్టింగ్ విషయమై ఎంపి (రాజ్యసభ సభ్యుడు) వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లిన స్థానికులు చందా గోపి , కముటం స్వామి,సింగంశెట్టి ఏకాంతం , పాల శ్రీనివాస్, ఆగే రాము, గొట్టం సుభాష్, గొట్టం లక్ష్మీనారాయణ, పూజరి అమరేందర్ తదితరులు హైదరాబాద్ లో ఆయన నివాసంలో కలసి వినతిపత్రం ఇచ్చారు .ఈ సందర్భముగా ఎంపి (రాజ్యసభ సభ్యుడు) వద్దిరాజు రవిచంద్ర సానుకూలంగా స్పందించి వెంటనే కేంద్ర రైల్వే మంత్రి మరియు అధికారులతో ఫోన్లో విషయాన్ని వారి దృష్టికి తీసుక వెళ్లారు. రైల్వే అధికారులతో చర్చించి కేసముద్రం రైల్వే స్టేషన్ లో గతంలో హాల్టింగ్ ఉన్నవి మరియు కొత్తవి పలు సూపర్ ఫాస్టు మరియు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు ప్రయత్నిస్తానని అన్నారు అని చందా గోపి తెలిపారు.

# తండ్రిని కోల్పోయిన రెండు కుటుంబాలకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ చేయూత

- లకావత్ ఈర్య, శంకర్ ల మరణం బాధాకరం సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ చిలువేరు సమ్మయ్య గౌడ్
- ఈర్య కుటుంబాన్ని పరామర్శించి 75 కేజీల బియ్యం, నెలసరి నిత్యవసర వస్తువులు, శంకర్ కుటుంబానికి రూ., 4000/- అందజేసిన సమ్మి గౌడ్







కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.02, తరంగాలు : కేసముద్రం మండలం పెద్దమోరి తండాకు చెందిన లకావత్ మంగమ్మ భర్త లకావత్ ఈర్య ,లకావత్ శంకర్ లు ఇటీవల అకాల మరణం చెందడంతో విషయం తెలిసిన వెంటనే సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య ఈర్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సాన-ుభూతిని తెలిపి ఈర్య చిత్ర పటం వద్ద నివాళులర్పించి, అదేవిధంగా లకావత్తు శంకర్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి, వారి ఇరువురి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు.అనంతరం ఈర్య కుటుంబానికి 75 కేజీల బియ్యం నెలసరి నిత్యవసర వస్తువులను,లకావత్ శంకర్ కుటుంబానికి రూ.4,000 ఆర్థిక సహాయం అందజేశారు చిలువేరు సమ్మయ్య గౌడ్.. సమ్మిగౌడ్ తనకున్న దానిలో కేసముద్రం మండలం లో ఇలాంటి ఎన్నో భీద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పిస్తున్న సందర్భాలను తండా వాసులు గుర్తు చేస్తూ స్సమ్మిగౌడ్ సేవలను కొనియాడారు.. ఈ కార్యక్రమంలో గుగులోత్ హుస్సేన్ నాయక్, లక్ష్మణ్ నాయక్,మాజీ MPTC బాలునాయక్, డోజర్ వెంకన్న,వెంకన్న,రెడ్యా, శ్రీను, శంకర్, ప్రవీణ్, యాకూబ్, కంటిపూడి అరుణ్, అందే గురువయ్య, బండారి ప్రభాకర్, శీలం యాకన్న, ఉదయ్ కుమార్, గంధసిరి నరేష్,యాకన్న, మంగ్యా, నరేష్, ప్రసాద్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మాంకల మొగిలి కి ఆర్థిక సహాయం చేసిన బి ఆర్ ఎస్ గ్రామ ముఖ్యనాయకులు



సంగెం నవంబర్ 2 తరంగాలు : సంగెం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ ముఖ్యకార్యకర్త మాంకాల మొగిలి మాతృమూర్తి అయిన మాంకల లక్ష్మీ పది రోజులు క్రింద మరణించడంతో ఆదివారం దశధిన కర్మలో పాల్గొని నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు వేమున్నాం అంటూ మనోధైర్యాన్ని ఇచ్చిన వారికి 14,500 ఐదు వందలరూపాయలు, 25 కేజీల బియ్యం ను ఆర్థిక సహాయంగా అందించిన సంగెం మాజీ సర్పంచ్ గుండేటి బాబు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కోడూరు సదయ్య, శరత్, బి ఆర్ ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డా. మురళీ నాయక్



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 02, తరంగాలు: కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో హరిహర గార్డెన్ నందు గోపాల వెంకట్ రెడ్డి - దేవేంద్ర,మంకు చంద్రా రెడ్డి నిర్మల ల కుమార్తె కుమారుడు తిలక్ రెడ్డి - మేఘన రెడ్డి ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ నాయక్.వివాహం మన సంస్కృతిలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పర్వదినమని, ఇది రెండు కుటుంబాలను ఒక్కటిగా కలిపే పవిత్ర బంధమని పేర్కొన్నారు. వధూవరులు తమ వైవాహిక జీవితంలో పరస్పర విశ్వాసం, ప్రేమ, సమన్వయం వంటి విలువలను పాటించి, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అదనంగా, సమాజంలో వివాహ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, కుటుంబ బంధాలను మరింత బలపరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్,యాదగిరి,గోపాల శ్రీనివాస్ రెడ్డి,రాజా నాయక్ పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం మండలంలో పాఠశాలలకు తాత్కాలిక బోధకులు, ఆయా పోస్టుల మంజూరు

కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్.02,తరంగాలు: కేసముద్రం మండలంలో పూర్వ ప్రాథమిక తరగతులు నడుస్తున్న కల్వల మరియు బోడగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలకు ప్రతి పా-ఠశాలకు ఒక బోధకులు మరియు ఒక ఆయా పోస్టుల చొప్పున మొత్తం 4 తాత్కాలిక పోస్టులు మంజూరు చేస్తూ మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి ఆదేశాలు జారీ చేసినట్లు కేసముద్రం మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతుల బోధకుల అర్హతలు ఇంటర్మీడియట్ లేదా దానికి సమాన-మైన విద్యతో పాటు బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆయా పోస్టుకు కనీస విద్యార్హత ఏడవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. స్థానిక నివాసులకు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వబడును. గౌరవ వేతనం బోధకులకు నెలకు 8 వేల రూపాయలు మరియు ఆయాకు నెలకు 6 వేల రూపాయల చొప్పున చెల్లించబడుతుంది. అర్హత మరియు ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను 07.11.2025 శుక్రవారం రోజులోగా కేసముద్రం మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించగలరని తెలిపారు.

# శవాలను బయటకు లాగి బూడిద ఎత్తుకెళ్తున్నారు

## - మానవత్వం మంటల్లో కూడా రాక్షస క్రీడలు





తరంగాలు మెదక్ జిల్లా నవంబర్ 02 : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో స్మశానంలో కాలిపోతున్న శవాలను చితిలోంచి బయటకు లాగి అక్కడి బూడిదను ఎత్తుకెళు న్నారు. శనివారం ఉదయం సగం కాలిన మృతదేహం చితిలోంచి బయటపడేసి ఉండటం రెండు రోజుల క్రితం ఓ మహిళ అంత్యక్రియల తర్వాత కూడా చితాభస్మాన్ని ఎత్తుకెళ్లడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. చేగుంటకు చెందిన కర్రె నాగమణి 70 సంవత్సరాల వృద్ధురాలు నిన్న ఉదయం చనిపోగా చేగుంటలోని వైకుంఠధామం లో అంతిమ సంస్కారాలు నిర్వహించిన కుటుంబ సభ్యులు ఈరోజు ఉదయం అంతిమ సంస్కారాల కార్యక్రమంలో భాగంగా వారి కుటుంబ సభ్యులు వైకుంఠధామం వెళ్లి చూడగా సగం కాలిన శవం పై చితిపై నీళ్లు పోసి శవాన్ని దుండగులు బయటకు లాగి మొన్న చనిపోయిన పక్కన ఉన్న చితిలోని మరో వృద్ధురాలు మురాడి నర్సమ్మ తల భాగం లో చితాభస్మం మొత్తం దుండగులు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న చేగుంట గ్రామస్తులు చేగుంట ఎస్ ఐ చైతన్యరెడ్డి కి సమాచారం ఇవ్వడం తో చేగుంట పోలీసులు విచారణ చేపట్టారు.

# బసీ ప్రజలు పడుతున్న సమస్యల పరిష్కారానికి గొంతు విప్పిన బిజెపి నాయకులు!

- **జవహర్ నగర్ నా గుండె కాయ అన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,మున్సిపల్ కమిషనర్ కూడా అటూ వైపు చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు!!**




తరంగాలు, సంగారెడ్డి జిల్లా నవంబర్ 2: జవహర్ నగర్(ప్రజావాణి): జవహర్ నగర్ ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలల్లో కురిసిన బారీ వర్షాలు, తుపాన్ ల కారణంగా జయశంకర్ నగర్, కె.సి.ఆర్ నగర్, న్యూ దేవేందర్ నగర్ వంటి బస్తీలలో వరద ముప్పు తీవ్రంగా పెరగడంతో స్థానిక ప్రజలు పడుతున్న సమస్యల పరిష్కారంపై నడుం బిగించిన బిజెపి నాయకులు. ఈ ప్రాంతాలలోని రోడ్లు ఇప్పుడు చెర-ువులు, వాగులను తలపిస్తున్నాయి. రోడ్ల పై పెద్ద పెద్ద కయ్యలు కోసుకుపోవడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి, పిల్లలు, వృద్ధులు నడవటానికి అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. డెంటల్ కాలేజ్, రాజీవ్ గాంధీ నగర్, గబ్బిలాల పేట నుండి వచ్చే మురుగునీరు డ్రైనేజి వర్షపు నీటితో కలసి రోడ్ల మీదుగా ప్రవహిస్తూ ఈ ప్రాంతాలను కలుషితం చేస్తోంది. ఈ కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి ప్రాణాంతక వ్యాధులతో పాటు చర్మ వ్యాదులు, థైరాయిడ్, శ్వాస కోశ వ్యాధులతో స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కూలీనాలీ చేసుకుని బతుకీడ్చే నిరుపేదలు వారి ఆదాయంలో సగానికి పైగా రోగాలకే ఖర్చు చేస్తూ అర్ధాకలితో అలమటిస్తున్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న మల్లారెడ్డి గాని,రెండేండ్ల ఇందిరమ్మ పాలనలో అధికార పార్టీ నాయకులు గాని ఈ కాలనీల లోని ఏ ఒక్క సమస్యను గూడా పరిష్కరించక పోవడం పాలనా వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇంత జరుగుతున్న ఈ ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే గాని,అధికార పార్టీకి సంబంధించిన నాయకులు గాని,మున్సిపల్ కమిషనర్ గాని పరిశీలించకపో వడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వందలాది కుటుంబాలు మురికినీటి మధ్య జీవనాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రజలు అత్యవసర ప్రాధాన్యతతో డ్రైనేజ్ శుభ్రపరచడం,త్రాగునీటి పరీక్షలు చేయించడం,తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, గబ్బిలాల పేట,శాంతి నగర్,గిరి ప్రసాద్ నగర్,నందుమురి నగర్, కేసీఆర్ నగర్,జయ శంకర్ నగర్,కార్మిక నగర్,తదితర మురికి వాడల్లోని వీధుల్లో భూగర్భ డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు,వేయాలని వరద నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ తూర్పు శాఖ బీజేపీ అధ్యక్షులు కర్లపూడి జోగారావు,రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి,సీనియర్ నాయకులు గిరి కత్తుల, వెంకన్న, జర్నలిస్ట్ శంకరాచారి, బాలు నాయక్, శ్రీధర్, మహేందర్, వంశీ తో పాటు కాలనీవాసులు ప్రజలు పాల్గొన్నారు.

# ధర్మవరం బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్

## - హాస్టల్లో విద్యార్థులు అన్నం తిని ఫుడ్ పాయిజన్ కు కారణాలపై విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

జోగులాంబ గద్వాల్ జిల్లా, ( ఇటిక్యాల ), నవంబర్ 2, తరంగాలు : జోగులాంబ గద్వాల్ జిల్లా, ధర్మవరం గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు అక్టోబర్ 31 శుక్రవారం రాత్రి సమయంలో దాదాపుగా100 మంది విద్యార్థులు అన్నము, క్యాబేజీ క్యాలీఫ్లవర్, సాంబార్ తదితర రకాల వాటితో రాత్రి సమయంలో విద్యార్థులు భోజనం తిన్నారు.100 మంది అన్నం తినిన వారిలో దాదాపు 54 మంది వరకు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఐ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు జ్వరంతో అధితరవాటికి విద్యార్థులు వెంట వెంటనే అస్వస్థతకు గురి అయ్యారు. ఫుడ్ పాయిజన్ ఐ తీవ్రంగా స్వస్థత గురైన వారిని అంబులెన్స్ లలో గద్వాల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి, చికిత్స కోసం దాదాపుగా 54 మంది విద్యార్థులను తరలించారు. అస్వస్థతకు గురైన హాస్టల్ విద్యార్థులకు డాక్టర్ల ద్వారా చికిత్స పొందుతున్న 54 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ శనివారం సందర్శించి విద్యార్థులను అందర్నీ పరామర్శించారు. ఫుడ్ పాయిజన్ అయిన వాటికి సంబంధించి తదితర వివరాల గురించి విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ అడిగి తెలుసుకున్నారు. ధర్మవరం గ్రామంలోని బీసీ బాలుర వార్డెన్



హాస్టల్ వార్డెన్ జయరాములు కేతావత్ నాయక్ నిర్లక్ష్యంగా, శుక్రవారం రాత్రి అన్నం కూరగాయలు తదితర వాటిని సక్రమంగా వండించకుండా ఉండిన వాటిని తిన్న విద్యార్థులు, వంట ఏజెన్సీల వారి నిర్లక్ష్యంగా 54 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురయ్యారని జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ తెలిపారు. అనారోగ్యాలకు గురి అయిన విద్యార్థులకు శుక్రవారం రాత్రి నుండి శనివారం వరకు వివిధ రకాల వైద్య చికిత్సలు డాక్టర్లు నిర్వహించారు. ధర్మవరం గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవ్వడానికి గల కారణాలు తదితర అంశాలపై కారణాలపై విచారణకు జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ ఈ సందర్భంగా శనివారం ఆదేశించారు.

# రోడ్లెక్కి ఆందోళన చేయడం కాదు.. ప్రజలకు తప్పు దోవ పట్టిస్తున్న మీకు ప్రజలే గట్టి బుద్ధి చెప్తారు

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



తరంగాలు, కోటగిరి : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని చౌరస్తా ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు బోనస్ డబ్బులు వేయడంతో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ,రైతులు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ మాట్లాడుతూ కోటగిరి మండల కేంద్రంలో కొన్ని పార్టీల వారు ప్రజలకు తప్పు దోవ పట్టించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బద్నాం చేయడం కోసం రోడ్లపై వచ్చి ఆందోళన పేరుతో విధ్వంసం సృష్టించడం చెయ్యడం చాలా సిగ్గుచేతనే ఇది సరికాదని అన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులపాలై ఉన్నప్పటికీ, ప్రజల కోసం రైతుల కోసం ఇచ్చిన హామీల ప్రకారంగా, నెరవేరుస్తున్నారని అందులో భాగంగా బోనస్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. రోడ్లపై వచ్చి ఆందోళన చేయడం కాదని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. నిరుపేద ప్రజలు ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే వారికి కూడా ఎప్పటికప్పుడే బిల్లులు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# కోటగిరి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ సరిగా పోస్తలేరు




తరంగాలు, కోటగిరి : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ సరిగా పోయటం లేదని మోసం చేస్తున్నారని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చక్రవాహన దారుడు పెట్రోల్ బంకు నిర్వాహకులతో ప్రశ్నల వర్షం కురిపించాడు. ఒక గంట క్రితం ఒక లీటర్ పెట్రోల్ పోసుకుంటే కనీసం 30 కిలోమీటర్లు కూడా యావరేజ్ ఇవ్వలేదని అన్నారు. మళ్లీ పెట్రోల్ కోసం రావడం జరిగిందని గంటకితం 110 రూపాయల పెట్రోల్ పోసుకున్నానని ఇప్పుడు కూడా 110 రూపాయల పెట్రోల్ పోసుకున్నా అని తెలిపాడు. పెట్రోల్ సరిగా యావరేజ్ ఇవ్వడం లేదని తక్కువ పెట్రోల్ పోసి మోసం చేస్తున్నారని తన గోడును విన్నవించాడు. ఈ పెట్రోల్ బంక్ పై సంబంధిత శాఖ అధికారులు ఎంక్వయిరీ చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరడం జరిగింది.

# దిగుబడి ఘననియంగా తగ్గింది

### వారం రోజుల దాటినా మా ధాన్యం సొసైటీ వారు కొనుగోలు చేయట్లేదు




తరంగాలు, కోటగిరి : పండించిన ధాన్యం ఆరబోసి సొసైటీకి అమ్మాలి అంటే ప్లేస్ లేదని దీంతో రోడ్డుపైనే ధాన్యం ఆరబోసుకుంటున్నామని రైతు తెలిపాడు. ధాన్యం గిట్టుబాటు ధర వచ్చేంతవరకు, నిలువ ఉంచుదామంటే గోడౌన్లు లేవని, ఈసారి వర్షం రావడం వల్ల పంటలకు లేనిపోని అంటూ వ్యాధులు రావడం వల్ల, వ్యవసాయ శాఖ అధికారులు సరైన సలహాలు సూచనలు ఇవ్వకపోవడం, రైతు పట్ల పట్టించుకోకపోవడం వల్ల తెలిసి తెలియని క్రిమిసంహారక మందులు వాడి, దిగుబడి సగం కు పైగా తగ్గిపోయిందని రైతులు తెలిపారు. వర్షం రావటం వల్ల ధాన్యం తడుస్తుందని మళ్లీ ఆరబోస్తున్నప్పటికీ మా ధాన్యం మాత్రం కొనుగోలు చేయడంలో సొసైటీ వారు కానీ ఐకెపి వారు కానీ ముందుకు వస్తలేరని సీరియల్స్ ప్రకారం అంటూ తమ గురించి పట్టించుకోవటం లేదని రైతులు లబోదిబోమంటున్నారు, రేపు అనగా సోమవారం తమధాన్యం కొనుగోలు చేస్తా అని చెప్పారు చూద్దాం అని రైతులు తమ గోడును తెలిపారు.

## మంజీర నది నుండి జోరుగా ఇసుక అక్రమ రవాణా..
# అటు వైపు చూడని అధికారులు



తరంగాలు, సాలూర : సాలూర మండలం మంధర్నా గ్రామంలో మంజీర నది నుండి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఇసుక మాఫియా రెచ్చిపోయింది. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఈ అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణా వాహనాల వేగానికి ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రహదారుల పై వడ్లు ఉండడంతో వాటి పై నుండి ఇసుక ట్రాక్టర్లు నడుపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇసుక మాఫియా దారులకు సంబంధిత రెవెన్యూ,పోలీస్ ల సహకారం మెండుగా ఉందని తెలుస్తోంది. పోలీసు పెట్రోలింగ్ వాహనాల ముందు నుండి ఇసుక ట్రాక్టర్లు వెళుతుంటే కూడా పోలీసులు ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.కొందరు మామూళ్లు తీసుకొని ఇసుక అక్రమ రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు తెలుస్తుంది.జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు,రైతులు కోరుతున్నారు.

# విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
### – తడపాకల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లోలపు రాజు

తరంగాలు, నిజామాబాద్ : విద్యారంగం అభివృద్ధి, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టిని సారించిందని, బాల్కొండ నియోజకవర్గం, ఏర్గట్ల మండలం, తడపాకల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లోలపు రాజు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో కావలసిన అన్ని వసతులు, సౌకర్యాలను కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన పునాదులను వేస్తుందని వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం నియోజకవర్గ కేంద్రాలలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించబోతుందని పేర్కొన్నారు. పోటీపరీక్షలకు కావలసిన పూర్తి మెటీరియల్ తో పాటుగా డిజిటల్ లైబ్రరీ ఈ సెంటర్లలో ఏర్పాటు చేయబోతుందని చెప్పారు. నిష్ణాషితులైన అధ్యాపకులతో ఆన్లైన్ కోచింగ్ ఇప్పించే ఏర్పాట్లను చేస్తున్నదని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరడానికి కావలసిన సకల సౌకర్యాలను ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో సేవలను అందిస్తుందని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లకు వేగవంతమైన చర్యలు
### - కాయితీ తండా కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ భాస్కర్

తరంగాలు, కామారెడ్డి : పోటెత్తుతున్న వానాకాలం ధాన్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతున్నదని, గాంధారి మండలం, కాయతీ తాండ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ జరుపుల భాస్కర్ పవార్ తెలిపారు. వడ్లు అమ్మిన రైతులకు వారి ఖాతాలో సకాలంలో డబ్బులను ప్రభుత్వం జమచేస్తుందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిందని గుర్తు చేశారు. రైతులు పండించిన ప్రతి చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చిందని వివరించారు.

# అన్నదాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
### - మాతుసంగెం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శంకర్ రావు

తరంగాలు, కామారెడ్డి : అన్నదాతలకు అండగా నిలవడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని, గాంధారి మండలం, మాతు సంగెం సంఘం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మాధోజి శంకర్ రావు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాలను ప్రవేశపెడుతున్నదని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ఉత్పత్తి అవుతున్న వానాకాలం ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికలను చేపడుతున్నదని చెప్పారు. రాష్ట్రంలోని సన్న ,చిన్న కారు రైతులను ఆదుకోవడానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరణ చేసిందని పేర్కొన్నారు. ఈ పథకం కింద వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందజేస్తున్నదని అన్నారు.




# కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఇంటింటి ప్రచారం
### - ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మరమత్తు పనులు చేయించిన మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి

జూబ్లీహిల్స్ తరంగాలు, నవంబర్ 2 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచార జోరు రోజు రోజుకీ వేగం పెంచుతున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ఈ రోజు ప్రముఖ సినీ నటుడు సుమన్.. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు.. రమ్య రావు లతో కలిసి వెంగల్ రావు నగర్ డివిజన్ యాదగిరి నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. అభివృద్ధి పనులు ఆగిపోయిన ఈ ప్రాంతంలో తిరిగి చైతన్యం తీసుకురావగలిగేది కాంగ్రెస్ ప్రభుత్వమే. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మళ్లీ అభివృద్ధి దిశగా సాగుతోంది. ఆ మార్పులో జూబ్లీహిల్స్ కూడా భాగస్వామ్యం



అవుతుందని తెలిపారు.ప్రజలతో కలిసి మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని నవీన్ యాదవ్ హామీ ఇచ్చారు..సుమన్, మనోహర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు లు మాట్లాడుతూ.. నవీన్ యాదవ్ యువ నాయకుడు, ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడు. ఆయన విజయం అనేది



జూబ్లీహిల్స్ ప్రజల విజయం అవుతుందని పేర్కొన్నారు. ప్రచారంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థికి ఆత్మీయ స్వాగతం పలికారు..జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పతాకం ఎగరడం ఖాయం అన్న నమ్మకంతో నవీన్ యాదవ్ ప్రచారాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు.

# స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కవాతు

మేడ్చల్ మల్కాజిగిరి, తరంగాలు, నవంబర్ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం విజయదశమి ఉత్సవం లో భాగంగా ఆదివారం నేరేడ్మెట్ లో స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేరేడ్మెట్ నగర్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కవాతు వెంకటేశ్వర నగర్ నుండి ప్రారంభమై, గీతా నగర్, లక్ష్మీనగర్, మొగల్ కాలనీల మీదుగా సాయినాథపురం చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విభాగ్ కార్యవాహ భర్తకుడి శ్రీనివాస్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత నిర్మాణం కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎంతో కృషి చేసిందని తెలిపారు. రాష్ట్రీయ



స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎన్నో సేవా



కార్యక్రమాలు చేస్తోందని ఆయన చెప్పారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

మేడ్చల్ మల్కాజ్గిరి, నవంబర్ 2, తరంగాలు : సోమవారం కీసర డివిజన్ విద్యుత్ వినియోగదారులు నాగారం విద్యుత్ సబ్ స్టేషన్ లో సమావేశం నిర్వహిస్తున్నట్లు కీసర డివిజన్ ఇంజనీర్ అధికారి తాళ్లపల్లి లింగయ్య తెలిపారు. సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కేకే గార్డెన్స్ ఎదురుగా నాగారం విద్యుత్ సబ్స్టేషన్ లో ఉదయం 10:30 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉన్నచో సమావేశానికి హాజరై దరఖాస్తులు చేసుకోవచ్చని వారు తెలిపారు. ఈ సమావేశానికి విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు..



# మద్నూర్‌లో 27వ రోజుకు చేరిన ప్రభాత్ పేరి వైభవం

తరంగాలు మద్నూర్ నవంబర్ 02 : కామారెడ్డి జిల్లా చుట్టుప్రక్కల ఎక్కడ లేని విదంగా కామారెడ్డి జిల్లా మద్నూర్ గ్రామంలో కార్తీకమాస ఆధ్యాత్మిక కాంతి వెలుగుల మధ్య కొనసాగుతున్న ప్రభాత్ పేరి కార్యక్రమం 27వ రోజుకు చేరుకుంది. మొత్తం 33 రోజుల పాటు నిర్వహించే ఈ పవిత్ర కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక పుణ్యధారను ప్రసరిస్తోంది. ప్రతి రోజు బ్రహ్మ ముహూర్తంలో లేచి, ఉదయం 5 గంటలకు బాలాజీ మందిరం నుండి ప్రారంభమయ్యే ప్రభాత్ పేరిలో భక్తులు గొప్ప భక్తి శ్రద్ధలతో పాల్గొంటున్నారు. శంఖనాదం, హారతులు, భజనలు, దేవనామస్మరణ లతో గ్రామం అంతా ఆధ్యాత్మికతతో మార్మోగుతోంది. గ్రామంలోని గల్లీ గల్లీల్లో ప్రభాత పేరి తిరుగుతుండగా, ఇంటి ముందురావడమే పుణ్యం అనుకుని గ్రామస్తులు భక్తిపూర్వకంగా స్వాగతం పలుకుతున్నారు. జంగం మహేశ్వరులకు హారతులు చేస్తూ గ్రామస్థులు పూజలతో పాల్గొంటు న్నారు.ప్రతి రోజు మార్గమధ్యలో ఉన్న



ఆలయాల్లో హారతులు చేసి, తీర్థప్రసాదం అందించడం ఈ పేరి ప్రత్యేకత. భక్తులు “మద్నూర్‌లో జరిగే ఈ ప్రభాత్ పేరి ఇక్కడి సంప్రదాయం, సంస్కృతి, మత పరమైన చైతన్యానికి ప్రతీక. ప్రతీ సంవత్సరం ఇది జరగడం గర్వకారణం” అని పేర్కొంటున్నారు. ఈ పవిత్ర పేరి నిర్వహణలో మార్వాడి రాజస్థాన్ సమాజ్ పెద్దలు ముందుండి సేవ చేస్తున్నారు. గ్రామంలోని



అన్ని వర్గాలు, అన్ని కులాల భక్తులు సమానంగా పాల్గొనడం విశేషం. ముందుండి నడుస్తున్న జంగం అప్పల మార్గదర్శకత్వంలో భక్తులు భజనలు పాడుతూ, శివనామస్మరణ చేస్తూ కార్తీకమాస పవిత్రతను చాటుతున్నారు. సంప్రదాయం, సంస్కృతి, భక్తి, ధర్మం, ఆరోగ్యం అన్నీ కలగలిసి ఉన్న ఈ ప్రభాత్ పేరి గ్రామానికి ఆధ్యాత్మిక శోభ తెస్తోంది.


# పెద్ద ఎక్లరా నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లిన స్వాములు

తరంగాలు, మద్నూర్ నవంబర్ 02 : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామ నుంచి శబరిమలకు ఆదివారం అయ్యప్ప స్వాములు పాదయాత్రగా తరలి వెళ్లారు. మాదాప్ప గురుస్వామి సోమావార్ నాగ్ నాథ్,సునీల్, జలందర్,సంతోష్ (దెగ్లూర్ )స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. అంతకు ముందు హనుమాన్ మందిరం వద్ద గ్రామస్థులు పాదయాత్ర స్వాముల పూజలు చేశారు. 45 రోజుల పాటు 1600 కిలో మీటర్ల పాదయాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు.అయ్యప్ప స్వాములకు మద్నూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్ మాజీ సొసైటీ చైర్మన్ పండిత్ రావ్ పటేల్ మాజీ ఎంపీటీసీ శంకర్ పటేల్ గ్రామ ప్రజలు,అయ్యప్ప స్వాములను కలసి క్షేమంగా వెళ్లిరావాలని కోరుకున్నారు.



# ఏకపక్ష కథనాలపై దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆగ్రహం

- ప్రైమ్ ఎంటర్టైన్మెంట్ సంస్థకు, ప్రశాంత్ వర్మకు మధ్య వివాదం
- కొన్ని మీడియా సంస్థలు పక్షపాతంతో వార్తలు ప్రసారం చేస్తున్నాయన్న ప్రశాంత్ వర్మ
- తనపై ఆరోపణలన్నీ నిరాధారమైనవని స్పష్టీకరణ



ప్రెస్ నోట్

కొన్ని మీడియా పోర్టల్స్, సోషల్ మీడియా పేజీలు, న్యూస్ ఛానెల్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన ఫిర్యాదు వివరాలను, అలాగే నా సమాధానం లోని కొన్ని భాగాలను మాత్రమే ప్రచురించడం, ప్రసారం చేయడం నా దృష్టికి వచ్చింది. ఈ పక్షపాత, బాధ్యతారహిత, ఏకపక్ష సమాచారం ప్రసారం చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.

నాకు, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఉన్న వివాదం ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ / తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ముందు విచారణలో, న్యాయ పరిశీలనలో ఉంది. ఈ సందర్భంలో అన్ని పక్షాలు ఆ ఫోరమ్ తీర్పును ఎదురు చూడటం మాత్రమే సమంజసం. మీడియా ద్వారా వివాదాన్ని తీర్చే ప్రయత్నం చేయడం సరైంది కాదు.

ఈ దశలో అంతర్గత పత్రాలు, ఇమెయిల్స్, ఒప్పందాలు లేదా ఆర్థిక వివరాలను బహిర్గతం చేయడం అనేది విచారణలో జోక్యం చేసుకోవడం వంటి చర్య అవుతుంది. ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో జరుగుతోంది.

**నా మీద చేసిన అన్ని ఆరోపణలు అసత్యం, నిరాధారం, ప్రతీకారపూరితమైనవే అని నేను స్పష్టంగా తెలియజేస్తున్నాను.**

అన్ని మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్, సోషల్ మీడియా ఛానెల్స్, న్యూస్ ఛానెల్స్ ఈ అంశంపై ఊహాగానాలు ఆధారంగా ప్రచారం చేయడం మానుకోవాలని, అలాగే తెలుగు ఫిల్మ్ ఛాంబర్ విచారణ ఫలితం వచ్చే వరకు వేచి చూడమని కోరుతున్నాను.

ప్రశాంత్ వర్మ

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ, తనపై వస్తున్న మీడియా కథనాలపై స్పందించారు. ప్రైమ్ ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో తనకు ఉన్న వివాదంపై కొన్ని మీడియా సంస్థలు ఏకపక్షంగా, పక్షపాతంతో వార్తలు ప్రసారం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఆయన ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ తరహా బాధ్యతారహిత జర్నలిజాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. తనకు, ప్రైమ్ ఎంటర్టైన్మెంట్ సంస్థకు మధ్య ఉన్న వివాదం ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ పరిశీలనలో ఉందని ప్రశాంత్ వర్మ తెలిపారు. ఈ దశలో అందరూ ఆయా సంఘాల తీర్పు కోసం ఎదురుచూడటమే సరైన పద్ధతని, మీడియా ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని చూడటం సరికాదని హితవు పలికారు. విచారణ దశలో ఉన్నప్పుడు ఒప్పందాలు, ఈమెయిల్స్, ఆర్థిక వివరాలు వంటి అంతర్గత పత్రాలను బయటపెట్టడం విచారణను ప్రభావితం చేయడమే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తనపై చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అసత్యమని, నిరాధారమైనవని, కేవలం ప్రతీకారంతో చేస్తున్నవని ఆయన కొట్టిపారేశారు. ఈ నేపథ్యంలో, అన్ని మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, సోషల్ మీడియా ఛానెళ్లు ఈ వివాదంపై ఊహాగానాలతో కూడిన ప్రచారాలు మానుకోవాలని కోరారు. ఫిల్మ్ ఛాంబర్ విచారణ తుది తీర్పు వెలువడే వరకు సంయమనం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# షూటింగ్ ముగించుకున్న రామ్ పోతినేని 'ఆంధ్రా కింగ్ తాలూకా'

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కొత్త చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. సినిమా చిత్రీకరణ విజయవంతంగా ముగిసిందని తెలుపుతూ, విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఫైనల్‌గా షూటింగ్ పూర్తయింది. నేను గర్వపడే సినిమా ఇది. మనమందరం గర్వపడే సినిమా అవుతుంది. త్వరలోనే మీ ముందుకు వస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ సినిమాపై ఆయన పూర్తి సంతృప్తితో ఉన్నట్లు ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది. అంతేకాకుండా, తన కెరీర్‌లో ఇలాంటి ఒక అందమైన చిత్రాన్ని అందించినందుకు దర్శకుడు పి. మహేశ్ బాబుకు రామ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. »»#AndhraKingTaluka is coming to you.. #AKTonNOV%28µµ అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా తన పోస్ట్‌కు జోడించారు. ఈ ప్రకటనతో రామ్ అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా టైటిల్ ఆసక్తికరంగా ఉండటంతో, రామ్ ఈసారి ఎలాంటి కథతో రాబోతున్నాడని సినీ వర్గాల్లో చర్చ మొదలైంది.



# ఇది నేను సానుభూతి కోసం చెప్పడంలేదు - సుధీర్ బాబు

తన సినీ ప్రయాణంలో అవకాశాల కోసం బావ, స్టార్ హీరో మహేశ్ బాబును ఏనాడూ సిఫార్సు చేయమని అడగలేదని నటుడు సుధీర్ బాబు స్పష్టం చేశారు. అందరిలాగే తానూ ఆఫీసుల చుట్టూ తిరిగి, ఆడిషన్స్ ఇచ్చి అవకాశాలు దక్కించుకున్నానని అన్నారు. శనివారం రాత్రి జరిగిన తన కొత్త చిత్రం 'జటాధర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన తన కెరీర్ ఆరంభంలోని కష్టాలను గుర్తుచేసుకున్నారు.

ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, "సూపర్‌స్టార్ కృష్ణ గారి అల్లుడిగా, మహేశ్ బాబు బావగా ఉండటం నాకు గర్వకారణం, అదొక పెద్ద బాధ్యత. అయితే, సినిమాల్లోకి రావడానికి చాలా ప్రయత్నాలు చేశాను. ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఏ ఆఫీసుకు వెళ్లినా మొదట బాగా మాట్లాడి, కాఫీ ఇచ్చి, ఆ తర్వాత అవకాశం లేదని చెప్పేవారు. నాకు కృష్ణానగర్‌లోని కష్టాలు తెలియకపోవచ్చు, కానీ ఫిలింనగర్‌లోని బాధలు తెలుసు. బస్సుల్లో తిరిగి అవకాశాలు వెతుక్కోవడం తెలియకపోవచ్చు, కానీ కారులో కూర్చుని బాధపడటం తెలుసు. ఇది సానుభూతి కోసం చెప్పడం లేదు. అలా చెప్పాలనుకుంటే నా మొదటి సినిమా సమయంలోనే చెప్పేవాడిని" అని అన్నారు.

"ఒక్క సినిమా ఛాన్స్ వస్తే చాలనుకున్న నేను ఇప్పటికి 20 చిత్రాలు పూర్తి చేశాను. ఇందులో హిట్స్, ఫ్లాప్స్ రెండూ ఉన్నాయి. అన్నిటికీ నేనే బాధ్యత తీసుకుంటాను. నా తొలి సినిమాలో వాయిస్ బాగోలేదన్నారు. ఆ ఫీడ్‌బ్యాక్‌తో ఇప్పటికీ రోజూ గంటపాటు వాయిస్ కల్చర్‌పై శిక్షణ తీసుకుంటున్నాను. బాడీ చూపిస్తాడనే కామెంట్లు రావడంతో 'సమ్మోహనం' లాంటి సాఫ్ట్ సినిమా చేశాను. అర్బన్ కథలే ఎంచుకుంటాడంటే 'శ్రీదేవి సోడా సెంటర్'తో మాస్ ప్రయత్నం చేశాను" అని సుధీర్ బాబు వివరించారు.

"నా కెరీర్‌లో ఏ దర్శకుడిని ఒక ఫైట్ పెట్టమని, ఏ నిర్మాతను ఒక్క రూపాయి ఎక్కువ ఇవ్వమని అడగలేదు. అలాగే మహేశ్‌ను కూడా నా కోసం రికమెండ్ చేయమని ఎప్పుడూ అడగలేదు. ఎందుకంటే నాకు అవకాశం విలువ తెలుసు. నేను 20 సినిమాలు చేయడానికి కారణం ఒకే ఒక్కడు.. కృష్ణ గారి అల్లుడు, మహేశ్‌బాబు వాళ్ల బావ" అని ఆయన వ్యాఖ్యానించారు. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహించిన 'జటాధర' చిత్రంతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమా నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది.



# శ్రీవారి సేవలో కొత్త దంపతులు.. తిరుమలలో నారా రోహిత్, శిరీష

కొత్త దంపతులు నారా రోహిత్, శిరీష ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నారా రోహిత్ దంపతులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. గత నెల 30న నారా రోహిత్, శిరీషల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తిరుమల వెంకన్న దర్శనానికి వచ్చారు. టీటీడీ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనం తర్వాత రంగనాయకుల మండపంలో నారా రోహిత్ దంపతులకు ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.







Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**